జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం 18 నవంబర్ 2026 పేజీలు:16



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన రామకృష్ణారెడ్డి

- కీర్తిశేషులు పెద్దలు అండపల్లి తిరుపతిరెడ్డి అండపల్లి - నారాయణరెడ్డి అండపల్లి అనంత్ రెడ్డి జ్ఞాపకార్థం

02

పాలమూరులో క్రీడా సంబరం..
ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు మహబూబ్‌నగర్ ముస్తాబు.!



- డిసెంబర్ 11 నుంచి 22 వరకు 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలి..

స్టేడియం పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి



మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

దేశవ్యాప్తంగా యువ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా నిలిచే 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ రాష్ట్రం వేదిక కానుండటం గర్వకారణమని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

- మిగతా 2 లో

పేద కుటుంబాలకు
కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా

- వనపర్తి నియోజకవర్గంలో నెలకు రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ
- మూడు మండలాల్లో 1,100 మందికి కొత్త పింఛన్లు అందజేత
- కరువు పరిస్థితులపై రైతులు అధైర్యపడొద్దు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



రేవల్లి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):

పేద కుటుంబాలకు సంక్షేమ భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం గ్రామ గ్రామాన పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గోపాలపేట మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో కలిసి గోపాలపేట, ఏదుల మండలాల లబ్ధిదారులకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం రేవల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పింఛన్ పత్రాలు, రేషన్ కార్డులతో పాటు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

- మిగతా 2 లో

ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి

- కుమ్మర సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.
- మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం మండల కమిటీల వినతి

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన గొప్ప కవయిత్రి, కుమ్మర సామాజిక వర్గానికి గర్వకారణమైన ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ పానగల్, వీపనగండ్ల, చిన్నంబావి మండల కమిటీలు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ని మంగళవారం రోజు మండల కేంద్రంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా మంత్రి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు రాములు, గౌరవ అధ్యక్షులు సూర్యవంశం వెంకటస్వామి లు మాట్లాడుతూ ఆతుకూరి మొల్లమాంబ రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలో రచించి తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన మహనీయురాలని పేర్కొన్నారు.

- మిగతా 2 లో



పాలమూరులో క్రీడా సంబరం..

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు మహబూబ్‌నగర్ ముస్తాబు.!

మొదటిపేజీ తరువాయి

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాలమూరు ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాలని పిలుపునిచ్చారు.మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించి ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలో నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్ పనులను తనిఖీ చేసి నిర్మాణాల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా 8వ ఎడిషన్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు.

తెలంగాణకు దక్కిన సువర్ణావకాశం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పట్టుదలతో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ అవకాశం తెలంగాణకు దక్కిందన్నారు. ఈ పోటీల్లో దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 8 వేల మంది క్రీడాకారులు, 1,500 మంది కోచ్‌లు పాల్గొననున్నారని తెలిపారు. దీంతో పాలమూరు ప్రాంతంలో క్రీడా పండుగ వాతావరణం నెలకొననుందని పేర్కొన్నారు.

క్రీడా మౌలిక వసతులకు రూ.226 కోట్లకు పైగా నిధులు

క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.23 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.203.36 కోట్ల నిధులు వెచ్చిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. స్టేడియాలు, క్రీడా మైదానాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు రాబోయే 20 ఏళ్ల పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిధుల కొరత లేదని, నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలి: జితేందర్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ తెలంగాణకు దక్కడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్ తదితర జిల్లాలకు కూడా క్రీడా పోటీలను కేటాయించడం అభినందనీయమన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని గుర్తుచేశారు. పోటీలకు వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ఈవెంట్ మేనేజర్లకు వసతి, భోజనం, రవాణా వంటి సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కల్పించాలని సూచించారు. కబడ్డీలో మహబూబ్‌నగర్‌కు స్వర్ణ పతకం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమిష్టి కృషితో క్రీడా మహోత్సవాన్ని విజయవంతం చేయాలి: శివసేనారెడ్డి

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడలకు కేంద్రంగా నిలుస్తోందని అన్నారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేపట్టి, ఈ నెల 25వ తేదీలోగా సంబంధిత పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తాం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో కబడ్డీ పోటీలు నిర్వహించే అవకాశం లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు. క్రీడాకారులు, కోచ్‌లకు అవసరమైన వసతి తదితర ఏర్పాట్లను ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాభిమానుల సమన్వయంతో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, మహబూబ్‌నగర్ మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎం.పి. వెంకటేష్, కార్యదర్శి కురుమూర్తి గౌడ్, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్, క్రీడా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ మూడు మండలాల పరిధిలో దాదాపు 1,100 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు రూ.11 కోట్ల పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. ‘ఇందిరమ్మ బీమా’ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయాలు తగవు

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని, రాష్ట్రంలో ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. కరువు ఉందని రైతులు, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెడుతూ, కాంగ్రెస్ తెచ్చిన కరువని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం నుంచి నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరకు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సరస్వతి ఎమ్ పి డి ఓ అల్లి కీర్తన మరియు ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, ఏదుల మండల అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, రేవల్లి మండల అధ్యక్షులు సుల్తాన్‌ఆలీ, జిల్లా నాయకులు వాడల పర్వతాలు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, సింగిల్ విండో ఛైర్మన్ లోడే రఘు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి.

మొదటిపేజీ తరువాయి

అటువంటి గొప్ప కవయిత్రి చరిత్రను, సాహిత్య సేవలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, ఆమెకు సముచిత గౌరవం కల్పించేందుకు ప్రతి మండల కేంద్రంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని,అదేవిధంగా కుమ్మర వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు నేటికీ ఆర్థికంగా, సామాజికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయ కుమ్మర వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.కుమ్మర వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు, విద్యుత్ కుండల తయారీ చక్రాలు, మట్టి నిల్వ చేసుకోవడానికి అనువైన స్థలాలు కల్పించాలని, కుమ్మర కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం, సబ్సిడీ రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అలాగే కులవృత్తి ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కుమ్మర సామాజిక వర్గానికి తగిన ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.కుమ్మర సంఘాల అభివృద్ధికి, సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని కోరుతూ, ఎన్నో ఏళ్లుగా తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.మా ఆడపడుచు ఆతుకూరి మొల్లమాంబకు సముచిత గౌరవం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మా సంప్రదాయ వృత్తిని కాపాడి, కుమ్మర కుటుంబాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాల ఏర్పాటు, కుమ్మర సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి అని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ, వెంకటేష్, జిల్లా కోశాధికారి, శ్రీను, వీపనగండ్ల, చిన్నంబావి పాన్గల్ మండల నాయకులు శేఖర్, శ్రీను, రవి, ఎల్లయ్య, సూరయ్య, వెంకటస్వామి,సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన రామకృష్ణారెడ్డి

మొదటిపేజీ తరువాయి

నాగర్ కర్నూల్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో)

అనూష ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు శంకర నేత్రాలయం వారు సంయుక్తంగానిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరశీ గత నాలుగు రోజులుగా వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలోవిజయవంతంగా కొనసాగుతుంది. గత నాలుగు రోజుల నుంచి ప్రారంభమైన ఈ శిబిరం కంటి వైద్యం కొరకు వచ్చే ప్రజలకు పరీక్షలు నిర్వహించి మంగళవారం అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తున్న నేపథ్యంలో.. అనూష ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ అండపల్లి రామకృష్ణారెడ్డి, వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యం కొరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని శంకర నేత్రాలయ సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గోవర్ధన్ రెడ్డి, శంకర నేత్రాలయ కోఆర్డినేటర్ బైరం రాజు, మల్లయ్య, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు రేనయ్య, తరుణ్ రెడ్డి, రామాంజనేయులు, హరీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటిదగ్గర పంపిణీ చేయడం సిగ్గుచేటు బిజెపి కౌన్సిలర్లు రామాంజనేయులు, కుమ్మరి శ్రీనివాసులు,శాలన్న చంద్ర శేఖర్..

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

ప్రభుత్వం నుండి కొత్తగా మంజూరైన చేయూత పింఛన్లను మున్సిపాలిటీ కార్యాలయం దగ్గర పంపిణీ చేయకుండా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఇంటిదగ్గర పంపిణీ చేయడం పట్ల బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు,కౌన్సిలర్ రామాంజనేయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా గద్వాల మున్సిపాలిటీలోని 37 వార్డులలో గల కౌన్సిలర్లు పింఛన్ల మంజూరు కొరకు గుర్తించి వారికి ఇప్పించాలని ఉండగా వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఓడిపోయిన కౌన్సిలర్లతో పింఛన్లు ఇప్పించడం సిగ్గుచేటని అన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు సమక్షంలో పంపిణీ చేయాల్సిన పింఛన్లను ఎమ్మెల్యే తన ఇంటి దగ్గర పంపిణీ చేయడం వల్ల అనేక మందికి ఇబ్బంది కలిగిందని తెలిపారు. అదేవిధంగా తాము ఒకరోజు ముందే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామని అయినా ఎమ్మెల్యే ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ పథకాలు ఏవైనా ఉంటే మున్సిపాలిటీ దగ్గర నిర్వహించాలి కానీ వారి వారి సొంత ఇంటి దగ్గర నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఆయన తెలిపారు.



గ్రామీణ ఉపాధికి భరోసా.. గ్రామాల అభివృద్ధికి

నూతన దిశ వి బి జి రామ్ జి పథకం

- ఎండలు చాలా ఉన్నాయి కాబట్టి గ్రామ కార్యదర్శులు టెంట్స్ మంచి నీటి సౌకర్యం కల్పించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.రామచంద్రారెడ్డి

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామం లో వి బి జి రాంజీ పనులు పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేద కుటుంబాల ఆర్థిక స్వావలంబన, కూలీలకు ఉపాధి భరోసా కల్పించే లక్ష్యంతో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) వి .బి .జి .రాంజీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని గతంలో ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 100 రోజుల పని కల్పించే విధానం ఉండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం కొత్త చట్టం ద్వారా సంవత్సరానికి 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీ కల్పించిందని తెలిపారు. అదేవిధంగా ఈ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వతపనులు ఐన నీటి భద్రత, సీసీ రోడ్స్,స్కూల్ బిల్డింగ్స్ ,జీపీ బిల్డింగ్స్,ఇతర జీవనోపాధి అభివృద్ధి, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా గ్రామసభలు, గ్రామపంచాయతీల భాగస్వామ్యంతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి అమలు చేసే విధానం ఈ పథకంలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే డిజిటల్ పారదర్శకత, సామాజిక తనిఖీలు, ప్రజలకు జవాబుదారీతనం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అదేవిధంగా2026 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు శాశ్వత అభివృద్ధి ఆస్తుల నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు.



అలాగేవికసిత్ భారత్ లక్ష్యం గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమని, ప్రతి పేద కుటుంబానికి ఉపాధి భరోసా, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పమని అదేవిధంగా తీవ్రమైన ఎండలు దృష్టిలో ఉంచుకొని జిల్లాఉన్న జీపీ కార్యదర్శులు టెంట్స్ మరియు మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికొండ భీం సేన్ రావు అయిజ మండల మరియు పట్టణ అధ్యక్షులు గోపాల కృష్ణ,తెలుగు నర్సింహ, నాయకులు లక్ష్మణ్ గౌడ్,శ్రీకాంత్ ముదిరాజ్,రజక నర్సింహ,భీమన్న తదితరులు పాల్గొన్నారు...

నందిన్నెలో వరుస చోరీలు.. సీసీ కెమెరాల్లో రికార్డు!

వెల్డింగ్ షాప్‌తో పాటు పొలాల్లో మోటార్లు, కేబుల్ వైర్ల అపహరణ..

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

కేటీ దొడ్డి మండలం,నందిన్నె గ్రామంలో వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. రఫీ వెల్డింగ్ షాప్ వద్ద మోటార్ల చోరీతో పాటు రైతుల పొలాల్లో మోటార్లు, కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. ఈ ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డైనట్లు సమాచారం. వరుస చోరీలతో రైతులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.ఇటీవల ఓ దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ చోరీలు కొనసాగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రాత్రి గస్తీ పెంచి దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే నందిన్నెలో జరిగిన చోరీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేటీ దొడ్డి ఎస్సై పి.శ్రీనివాసులు తెలిపారు.



విధుల్లో అలసత్వం చూపే ఉద్యోగులను తొలగించాలి

- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.
- హాజరు నమోదు చేయని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు.
- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి.
- వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.
- ఆసుపత్రి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

విధుల్లో అలసత్వం చూపే ఉద్యోగులను తొలగించాలని, హాజరు సక్రమంగా నమోదు చేయని ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రసూతి, శిశు సంరక్షణ విభాగాలు, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల లభ్యత, పారిశుద్ధ్యం, వైద్య సిబ్బంది హాజరు, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రసూతి, డెలివరీ విభాగాల్లో అనవసరమైన రద్దీ లేకుండా చూడాలని, ప్రసవం అనంతరం తల్లులు, శిశువులను నిర్దేశించిన వార్డులకు తరలించాలని సూచించారు. అలాగే నవజాత శిశువుల గుర్తింపు కోసం తల్లి, తండ్రి వివరాలు, ప్రత్యేక ఐడీతో కూడిన ట్యాగింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అదేవిధంగా శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నియోనాటల్ స్పెషలిస్ట్ సేవల అవసరాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే మాతా సంరక్షణ విభాగంలో బెడ్ షీట్ల కొరతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

(అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరు.)

ఆసుపత్రిలో వివిధ మరమ్మత్తులు, అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందని, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని వార్డుల్లో ఫ్యాన్లు, ఏసీలు, లైట్లు, తదితర సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా మరుగుదొడ్ల నిర్వహణ, వార్డుల పరిశుభ్రత, రోగులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట జెరియాట్రిక్ వార్డును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే వివిధ వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. వారి కేసు షీట్లను పరిశీలించి అందిస్తున్న వైద్య సహాయంపై ఆరా తీశారు. అదేవిధంగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగులను ఇతర ప్రాంతాలకు అనవసరంగా రిఫర్ చేయడం తగదన్నారు. నిబంధనల ప్రకారం ఇన్ పేషెంట్ లకు ఆహారం అందజేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



(రోగులతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు)

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని రోగులను సూచించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా డిస్పెన్సరీ, సెంట్రల్ స్టోర్స్‌లో మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులకు పంపించడం లేదా బయట మందులు కొనుగోలు చేయాలని సూచించడం, ప్రభుత్వ వైద్య సామాగ్రిని బయట అమ్ముకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

(వైద్య సిబ్బంది హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ)

వైద్యులు, ప్రొఫెసర్లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకావాలని, బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే పర్యవేక్షకుల ఛాంబర్ లో కలెక్టర్ ఉద్యోగుల, ఇతర సిబ్బంది హాజరు రిజిస్టర్ లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గత 45 రోజుల హాజరు వివరాలను పరిశీలించి, మాన్యువల్ రిజిస్టర్, ఆన్‌లైన్, బయోమెట్రిక్ హాజరు వివరాలను సరిపోల్చి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని వారి స్థానంలో ఆమోదిత మెరిట్ జాబితా ప్రకారం తదుపరి అర్హులైన అభ్యర్థులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మెరిట్ జాబితాలో ఎలాంటి మార్పులు చేయడానికి ఏజెన్సీలకు అధికారం లేదని స్పష్టం చేశారు.

(మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందించాలి)



ఆసుపత్రిలో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా ఓపి బ్లాక్ వద్దకు వెళ్ళిన కలెక్టర్ అక్కడి ఔట్ పేషెంట్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే రోగులకు ఇబ్బంది లేకుండా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. అదేవిధంగా గైనకాలజీ విభాగం ఇరుకుగా ఉండడంతో మరోచోటికి తరలించాలన్నారు. కొత్తగా చేరిన నర్సింగ్, సాంకేతిక సిబ్బందికి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించాలని తెలిపారు. అదేవిధంగా ఎంఎల్టి, ఎంపీహెచ్డబ్ల్యూ పూర్తి చేసిన విద్యార్థులు ఆసుపత్రికి శిక్షణ నిమిత్తం రావడంతో కలెక్టర్ వారితో మాట్లాడారు. విద్యార్థులు పనిలో నైపుణ్యాలను మెరుగుపరచుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

(ఆసుపత్రిలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనివ్వాలి.)

ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని, భద్రతా సిబ్బంది విధులను పటిష్టంగా పర్యవేక్షించాలని, వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. అదేవిధంగా రోగుల సహాయకులు పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ కూర్చోకుండా వారికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా తాగునీటి కొరత లేకుండా చూడాలని, వాష్రూమ్స్ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండకుండా పలుచోట్ల భారీ కేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తనిఖీలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిచేయాలని, చేపట్టిన చర్యలపై విభాగాల వారీగా సమగ్ర యాక్షన్ టేకెన్ రిపోర్టును సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి మెరుగైన వైద్యం, నాణ్యమైన సౌకర్యాలు అందించడం అధికారుల ప్రధాన బాధ్యత అని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మి, ఇతర వైద్యాధికారులు, తదితరులున్నారు.

చావు బతుకుల్లో ఉన్న తన తల్లిప్రాణాలు బాగుండాలని 12 జ్యోతిర్లింగాల పరమశివుని దర్శనం కోసం కుమారుని పరుగు యాత్ర

- నిజజీవితంలో జరిగిన ఒక యదార్థ కథ

- దేశవ్యాపితంగా ఆ యువకుడికి జనం జై జై లతో నీరాజనాలు













నర్వ నవంబర్ 17 ప్రజా జ్యోతి

నవ మాసాలు మోసిన కన్నతల్లి అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చావు బతుకుల మధ్య గుట్టుమిట్టాడుతున్న తన తల్లిని ఎలాగైనా బతికించుకోవాలని ఆ కొడుకు తపన, చేసేది లేక బీహార్ లోని ఓ శివాలయానికి వెళ్లి తన తల్లి ఆరోగ్యంగా బయటపడితే దేశంలోని 12 జ్యోతిర్లింగాలను పరిగెడుతూ దర్శించుకుంటానని పరమశివునితో మొర పెట్టుకున్నాడు అంతలో తల్లి స్నృహలోనికి రావడం గమనించిన కొడుకు పరమశివునికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కఠిన నిర్ణయం తీసుకొని భారతదేశంలో ఉన్నటువంటి 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని దేవుడికి మొక్కుకున్న బీహార్ రాష్ట్రానికి చెందిన 19 ఏళ్ల మోను యధార్థ కథ ఇది ప్రస్తుతం దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడం ప్రజలు చూస్తూనే ఉన్నారు, రెండు నెలల క్రితం బీహార్ నుండి ఎండ నక్క గాలెనక వాననక ప్రారంభించిన పరుగుయాత్రను ప్రస్తుతం 8000 కిలోమీటర్ల వరకు పరుగెడుతూ ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు, ఇంకా 7000 కిలోమీటర్లు పరిగెడుతూ ఆరు జ్యోతిర్లింగాలను దర్శించుకుకోవలసి ఉన్నది, ఈ యాత్రకు దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రజలు మోనుకు జేజేలు కొడుతూ నీరాజనాలతో స్వాగతం పలుకుతు ప్రశంసాలు కురిపిస్తున్నారు.ప్రాణాలకు తెగించి కన్నతల్లి కోసం పరుగు యాత్రను ఎంచుకున్న కొడుకుకు ప్రజా జ్యోతి పత్రిక ద్వారా జేజేలు తెలుపుతూ పాఠకులకు ఈ మంచి కుమారుని గురించి పరిచయం చేస్తున్నాము

ప్రైవేట్ టీచర్ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

పానగల్ మండల కేంద్రంలో చేయూత పెన్షన్ పంపిణీకి హాజరైన తెలంగాణ పర్యాటకడ ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావుకి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ డలెక్చరర్స్ సంఘం ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. టిపిటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హుస్సేన్, పరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో అనేకమంది టీచర్స్ మరియు లెక్చరర్స్ చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తు విజ్ఞానజ్యోతులను వెలిగిస్తూ ప్రైవేట్ టీచర్స్ బతుకులు అంధకారంలో కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్స్డ లెక్చరర్ సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి భరోసా ఇవ్వాలని, ప్రైవేట్ టీచర్స్ కు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు కూడా ఇవ్వాలని, విధులు నిర్వహిస్తూ ప్రమాదాల బారిన పడిన వారిని కూడా ఆదుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు వెంకటస్వామి, రామచందర్ జి,రవి,మల్లెపు నాగరాజు,ఎత్తం నాగరాజు రాములు, నరేష్, రవి,మల్లెపు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



అమీన్పూర్ లో మహిళలకు సఖి సేవలు, కేంద్ర పథకాలపై అవగాహన





ఊట్కూరు,నవంబర్ 17, (ప్రజాజ్యోతి):

ఊట్కూరు మండలం అమీన్పూర్ గ్రామంలో సర్పంచ్ తప్ప నాగేష్ ఆధ్వర్యంలో కార్మికులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో పనిచేస్తున్న కౌన్సిలర్ చాన్సుల్తానా, సఖి సెంటర్ నుండి చంద్రకళ, సరోజ, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు. వీబీజీ రాంజీలో పనిచేసే సలీం, మైబు తదితర కార్మికులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.సఖి కేంద్రం నుంచి గ్రామ మహిళలకు సఖి అందించే ఐదు రకాల సేవల గురించి వివరించారు. అవి వైద్యం, షెల్టర్, కౌన్సిలింగ్, న్యాయపరమైన సలహాలు, పోలీస్ సపోర్టు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, అత్యవసర సమయంలో 181 నంబర్ కు కాల్ చేయాలని తెలియజేశారు. మహిళలు భయపడకుండా సఖి కేంద్ర సేవలను వినియోగించుకోవాలని సూచించారు.అదేవిధంగా చాన్సుల్తానా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జన్ ధన్ ఖాతాల గురించి, కేవైసీ అప్డేట్ గురించి చెప్పారు. చిన్న మొత్తంలో పొదుపు చేస్తూ భవిష్యత్తుకు భద్రత పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేష్ మాట్లాడుతూ ఇలాంటి ప్రభుత్వ పథకాలు వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న వారికి ఎంతో మేలు కలిగిస్తాయని చెప్పారు. అందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు స్పష్టంగా సమాధానాలు చెప్పి ముగించారు.

కాంగ్రెస్ 420 హామీలకు కాలం చెల్లింది!

- ఆరు గ్యారెంటీలు అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం.. ప్రజలకు సమాధానం చెప్పాలి

- హామీల పత్రాలను చింపివేసి నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ (ప్రజా జ్యోతి బ్యూరో):

ఎన్నికల సమయంలో ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. పెంచుతామని ప్రకటించిన పెన్షన్లను వెంటనే పెంచి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలు చింపి చెత్తబుట్టలో వేయాలనుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్య మంత్రిగా ఉండటం జిల్లాకు గర్వకారణం కావాల్సిందిపోయి, పాలమూరు రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకర మన్నారు. పాలమూరు --రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.పట్టణ అధ్యక్షుడు ఆర్. శివరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం వంటి హామీలను అమలు చేయాలని కోరారు. పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.మాజీ ఫ్లోర్ లీడర్ కట్ట రవికిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లలో నీటి కొరత, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు కనీసం ఆరోగ్య భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాడం ఆంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పక్క రాష్ట్రానికి నీటి తరలింపు జరుగుతోందని ఆరోపిస్తూ, పాలమూరు ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తే జిల్లాలోని రైతులకు సాగునీరు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమైతే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు ప్రజలే సమాధానం చెబుతారని హెచ్చరించారు.



హామీల పత్రాలను చింపివేసి నిరసన

మీడియా సమావేశం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల పత్రాలను బీఆర్ఎస్ నాయకులు చింపివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

మైనర్ బాలిక మృతి ఘటనపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం!

- నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నాం

- కేసులో మరెవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టేది లేదు

- పోక్సో చట్టం కింద కేసు నమోదు.. సీఐ సుగంధం రత్నం







చిన్నంబావి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో చోటుచేసుకున్న మైనర్ బాలిక మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించి దర్యాప్తును వేగవంతం చేశారు. బాలిక మృతికి సంబంధించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఘటనకు బాధ్యులుగా ఉన్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు వనపర్తి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుగంధం రత్నం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని దగడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికకు సంబంధించిన ఘటనపై ఈ నెల 14వ తేదీన బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. ఈ నెల 9వ తేదీన చోటుచేసుకున్న ఘటన అనంతరం బాలికను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అయితే చికిత్స పొందుతూ బాలిక నిన్న మధ్యాహ్నం మరణించడంతో కేసును మరింత తీవ్రంగా పరిగణించి అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.నిందితులపై చట్టపరమైన చర్యలు బాలిక మృతి ఘటనకు సంబంధించి ఇప్పటికే నిందితులను గుర్తించామని, వారిని ఈరోజు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు. ఈ కేసులో మరెవరైనా ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే వారిని కూడా గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యులెవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని, దర్యాప్తు పారదర్శకంగా కొనసాగుతుందని తెలిపారు.పోక్సో చట్టం కింద కేసు నమోదు ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 98/2026గా కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. బీఎన్ఎస్ సెక్షన్లు 107, 49తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు 11, 12 కింద కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఈ కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్ట్ ప్రక్రియలో చిన్నంబావి మండల ఎస్ఐ రామన్ గౌడ్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ తెలిపారు. పోలీస్ సమన్వయంతో కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఐ సుగంధం రత్నం మాట్లాడుతూ.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

ఫిర్యాదుపై విచారణకు ఆదేశాలు.. మల్లికా ఆసుపత్రిని సందర్శించిన వైద్య బృందం.!

- డా. మహేష్ బాబు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక విచారణ ప్రారంభం

- డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు పర్యవేక్షణలో విచారణ

అధికారి డా. మల్లికార్జున్ క్షేత్రస్థాయి పరిశీలన

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):


మల్లికా ఆసుపత్రికి సంబంధించిన ఫిర్యాదు వ్యవహారంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. హసీనా బేగం అనే రోగి తరఫున ఆమె భర్త హనీఫ్ అహ్మద్ చేసిన ఫిర్యాదుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించి విచారణ ప్రక్రియను ప్రారంభించింది.ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శ్రీనివాసులు విచారణ అధికారిగా జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. మల్లికార్జున్‌ను నియమించారు. మంగళవారం డా. మల్లికార్జున్, డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు కలిసి మల్లికా ఆసుపత్రిని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఫిర్యాదుకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.

ఫిర్యాదే ఆధారం.. వాస్తవాలే విచారణలో కీలకం.!

ఒక రోగి కుటుంబ సభ్యుడు చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించడం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ప్రాథమిక విచారణ మాత్రమే ప్రారంభమైన నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన అనంతరం వెలువడే నివేదిక ఆధారంగానే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.డా. మహేష్ బాబు వ్యవహారంలోనూ ఆరోపణలు, వాస్తవాలు వేర్వేరుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. విచారణ నివేదిక రాకముందే ఎలాంటి నిర్ధారణలకు రావడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్య సేవలపై నమ్మకం నిలవాలంటే పారదర్శక విచారణ అవసరం.!

రోగులకు అందించే వైద్య సేవల విషయంలో ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించడం ఎంత ముఖ్యమో, విచారణలో సంబంధిత వైద్యుల వాదనలకు కూడా సముచిత అవకాశం కల్పించడం అంతే అవసరం. ఈ నేపథ్యంలో మల్లికా ఆసుపత్రి వ్యవహారంపై అధికారులు చేపట్టిన విచారణ నివేదికపై ఆసక్తి నెలకొంది.



కామ్రేడ్ పోట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి సభను జయప్రదం చేయాలి



ధరూర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తిక్ పిలుపు

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా సీపీఐ (ఎం-ఎల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ పోట్ల రామనర్సయ్య 50వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తిక్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ధరూర్ మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కార్తిక్ మాట్లాడుతూ, కామ్రేడ్ పోట్ల రామనర్సయ్య ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలు, ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా డిసెంబర్ 18వ తేదీన ఉదయం 11 గంటలకు వరంగల్‌లోని పోచమ్మ మైదానంలో 50వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాస్వామికవాదులు, ప్రజా ఉద్యమాల అభిమానులు సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలింపాష, నర్సింహులు, వీరేష్, రమేష్, నర్సప్ప, వంశీ, చక్రదర్, హనుమంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ.!

– జిల్లా జైలును సందర్శించి సమస్యలు తెలుసుకున్న కార్యదర్శి డి. ఇందిరా

– వీర సైనికుల కుటుంబాల సంక్షేమానికి

‘వీర్ పరివార్ సహాయతా యోజన--2025’పై అవగాహన

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిరా మంగళవారం జిల్లా జైలును సందర్శించి ఖైదీల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మరోవైపు దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల కుటుంబాలకు న్యాయ సహాయం, సంక్షేమ ప్రయోజనాలు అందించే ‘వీర్ పరివార్ సహాయతా యోజన--2025’ అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఖైదీల సమస్యలపై ఆరా.. సౌకర్యాల పరిశీలన

జిల్లా జైలును సందర్శించిన డి. ఇందిరా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయ సహాయం పొందాల్సిన ఖైదీలు తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

వీర సైనికుల కుటుంబాలకు అండగా వీర్ పరివార్ యోజన

అనంతరం జిల్లా సైనిక సంక్షేమ బోర్డు కార్యాలయంలో నల్సా ప్రవేశపెట్టిన ‘వీర్ పరివార్ సహాయతా యోజన--2025’ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ పథకం ద్వారా వీర సైనికుల కుటుంబాలకు అందించాల్సిన న్యాయ సహాయం, సంక్షేమ ప్రయోజనాలు, ఇతర సహాయక కార్యక్రమాలపై వివరించారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని డి. ఇందిరా సూచించారు.

అర్హులందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

జిల్లాలో ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారికి సేవలు అందించడంతో పాటు, అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ బోర్డు అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న చేయూత

మండలంలో 349 మందికి చేయూత పింఛన్లు మంజూరు!

14 గ్రామపంచాయతీల లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేయూత పింఛన్లను మంజూరు చేసింది. మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 349 మందికి చేయూత పింఛన్లు మంజూరైనట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి







కృష్ణారావు వెల్లడించారు.మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాని ఎంపీడీవో నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. చేయూత పింఛన్ల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ భీమ్యా నాయక్ నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం తాసిల్దార్ ఖాజా మైనుద్దీన్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, వీపనగండ్ల గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ కల్వరాల సర్పంచ్ రాముడు బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కావలి మహేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాజయ్య వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

బుధవారం 18 నవంబర్ 2026

ఖేలో ఇండియా క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి వసతులు.!

– బస ఏర్పాట్లపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా, క్రీడల సలహాదారు జితేందర్ రెడ్డి ప్రత్యేక దృష్టి

– బోయపల్లి మైనారిటీ గురుకులంలో వసతి గదులు, డార్మిటరీలు, తాగునీటి సౌకర్యాల పరిశీలన

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రతిష్ఠాత్మకమైన 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మహబూబ్‌నగర్ వేదిక కానుండటంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి మంగళవారం బోయపల్లి సమీపంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల-1ను సందర్శించి క్రీడాకారుల బస కోసం చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గదులు, డార్మిటరీలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్రీడాకారుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని, పరిశుభ్రత, నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.



క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు.!

డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జితేందర్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. జాతీయ స్థాయి పోటీలకు వచ్చే క్రీడాకారులకు నాణ్యమైన వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అవసరమైన సదుపాయాలను కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పాలమూరు జిల్లాకు దక్కిన ఈ ప్రతిష్ఠాత్మక



అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రీడా పోటీల నిర్వహణలో జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఛత్రు నాయక్, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతే ముఖ్యం.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.!

– గండీడ్, సాలార్‌పేట పాఠశాలల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మిక తనిఖీలు

– వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ఆరా

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత సిబ్బందికి సూచించారు. మంగళవారం గండీడ్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గండీడ్, సాలార్‌పేటలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వంటశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక తనిఖీ

పాఠశాలల వంటశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్ వంట పాత్రల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, వంటకు ఉపయోగిస్తున్న ముడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పోషక విలువలపై ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటకు నాణ్యమైన ఆహార పదార్థాలనే



వినియోగించాలని, వంటశాలలు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆహార పదార్థాలను తగిన జాగ్రత్తలతో నిల్వ చేయాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం వద్దు!

మధ్యాహ్న భోజనం తయారీ నుంచి విద్యార్థులకు వడ్డించే వరకు ప్రతి దశలోనూ బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఉండాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో విద్యార్థులందరికీ శుభ్రమైన,



నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది ప్రతిరోజూ మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించాలని, ఏవైనా లోపాలు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో అధికారులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

అయిజలో ఘనంగా దళిత చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మండలంలో దళిత చైతన్యాన్ని పెంపొందిస్తూ, సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం నిర్వహించనున్న దళిత చైతన్య సభ పోస్టర్‌ను టి పి సి సి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ షవాలి ఆచారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, గద్వాల జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, వైస్ చైర్మన్లు బీఆర్ తిమ్మన్న, రాము, ధరన్న ,అశోక్ ,పాల్గొన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో దళిత చైతన్యాన్ని మరింత బలోపేతం చేయడమే దళిత చైతన్య సభ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ డిపార్ట్మెంట్ అయిజ మండల అధ్యక్షుడు రవి కుమార్ , టౌన్ రవికుమార్ మున్సిపల్ కౌన్సిలర్లు మద్దిలేటి, భాష, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాల మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, తిరుమలేష్, పాండురంగ, సుబ్బన్న, ఈరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యసనాలకు దూరంగా ఉండాలి.. క్రీడల్లో రాణించాలి

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

విద్యార్థులకు ఠాకూర్ బాలాజీ సింగ్ పిలుపు

కల్వకుర్తి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):

విద్యార్థులు డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉంటూ విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఠాకూర్ బాలాజీ సింగ్ సూచించారు. కల్వకుర్తి పట్టణంలో గత ఎనిమిది రోజులుగా నిర్వహించిన కల్వకుర్తి స్కూల్స్ ప్రీమియర్ లీగ్ (ఖ్రూూ-2) క్రికెట్ పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఠాకూర్ బాలాజీ సింగ్ విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ పోటీల్లో మిలీనియం స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బాలాజీ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలు, చదువుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.కె. నవీన్ కుమార్, భాను, కృష్ణ, సంజీవ్ ఆధ్వర్యంలో పోటీలు విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజేందర్, ఖదీర్, జహీర్, పట్టణంలోని పీఈటీ ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించారు.



మండల కేంద్రాల్లో మొల్లమాంబ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- కుమ్మర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి..

మంత్రి జూపల్లికి సంఘం నాయకుల వినతి

వనపర్తి, నవంబరు 17 (ప్రజాజ్యోతి):

మొల్లమాంబకు సముచిత గుర్తింపు కల్పించేలా వనపర్తి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆమె విగ్రహాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు కోరారు. అలాగే కుమ్మర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, సంప్రదాయ వృత్తిని ప్రోత్సహించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావును పానగల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల కుమ్మర సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాములు, గౌరవ అధ్యక్షుడు సూర్యవంశం వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన ఆతుకూరి మొల్లమాంబ చరిత్రను భావితరాలకు పరిచయం చేసేలా మండల కేంద్రాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. తరతరాలుగా కుమ్మర వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆధునిక పనిముట్లు, విద్యుత్‌తో పనిచేసే కుండల తయారీ యంత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మట్టి నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించడంతో పాటు ఆర్థిక సహాయం, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కుమ్మర యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రోత్సాహం కల్పించాలని, సంఘాల అభివృద్ధికి, సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, మూడు మండలాల సంఘం నాయకులు, సామాజికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.



జేఏసీ ఆధ్వర్యంలో ఆర్డీఎస్ సమస్యలపై పోరుబాట

- మండలాల వారీగా జేఏసీ చైర్మన్ ల ద్వారా ఆర్డిఎస్ సమస్యలను ఎమ్మార్వో,ఎంపీడీవో, ఆర్డిఓలకు ఆర్డీఎస్ కాలువ జలసాధనకు వినతులు అందజేసే కార్యక్రమం.

- తుంగభద్ర కృష్ణానది ల మధ్య ఉన్న నడిగడ్డ మండలాలు మానవపాడు ఉండవెల్లి అల్లంపూర్లను మరో కోనసీమ గా మార్చుటకు గుండిమల్ల వెల్టూర్ బ్యారేజ్ ని నిర్మించాలి.

- తుమ్మిళ్ల లిఫ్ట్ తరహా శ్రీశైలం బ్యాక్ వాటర్ కి మారుమూలాల వద్ద లిఫ్టును ఏర్పాటు చేసి 30 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలి.

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవెల్లి మండలం లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా జలసాధన జేఏసీ తాలుక చైర్మన్ రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశ ముఖ్యంగా డిస్టిబూటర్ల వారీగా అల్లంపూర్ తాలూకులోని ఆర్ .డి .ఎస్ సమస్యలను గ్రామాలో కాల్వ ఉండి గత రెండు దశాబ్దాలుగా నీళ్లు పారకపోవడంతో రైతుల ఆవేదన అదేవిధంగా రెండు నదుల మధ్యన నడిగడ్డ మండలాలను మరో కోనసీమగా మార్చుటకై గుండిమల్ల వెల్టూరు బ్యారేజ్ని నిర్మాణము,తుమ్మిళ్ల కాల్వ విస్తీర్ణం పెంచి మల్లమ్మ కుంట రిజర్వాయర్ ను త్వరగా పూర్తిచేసి, శ్రీశైలం బ్యాక్ వాటర్ దగ్గర మారమునగాల లిఫ్టును ఏర్పాటు చేసి చివరి మండలాలైన మానపాడు, ఉండవల్లి, అల్లంపూర్ మండలంలోని 30 వేల ఎకరాలకు పారిచాలని, అందులో భాగంగా కాల్వ రిపేర్లను, కాలువలో పూడిక తీతను, జంగిల్ కటింగ్ ను మండలంలోని గ్రామాల వారిగా కన్వీనర్,కో కన్వీనర్ ద్వారా మండలాల కన్వినర్ల ఆధ్వర్యంలో ఎమ్మార్వో మరియు ఎంపీడీవో కు సమస్యలపై రైతుల ద్వారా వినతిపత్రాలు అందజేయవలెనని తీర్మానించడం అయినది. ఈ కార్యక్రమంలో ఆలంపూర్ తాలూకా జేఏసి చైర్మన్ తో పాటు తాలూకా సమన్వయ కర్త మాజీ సర్పంచి శేషన్ గౌడ్, సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోంగల్ల ఈశ్వర్ అలంపూర్ కన్వీనర్, ఉండవెల్లి మండల కో కన్వీనర్ రాఘవేంద్ర అల్లంపూర్ మండల జేఏసీ సభ్యులు తోపాటు పత్రిక విలేకరులు శేషు నాయకంటి కృష్ణ, ఏబీ న్యూస్ ఛానల్ రాఘవగారు తదితరులు పాల్గొన్నారు.



చిన్నంబావి మండలంలో 364 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి,నవంబర్ 15: (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలోని సునీత ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమం కల్వూరు గ్రామానికి చెందిన మత్స్యకారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు మూడు చేపల ద్విచక్ర వాహనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిలుగా పాల్గొని లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో ఉమాదేవి, సుబ్రమణ్యం, ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్,తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, గత పాలకులు రాష్ట్రంపై మోపిన ఆర్థిక భారాన్ని అధిగమిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా నూతన పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు చేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించడం ప్రజా ప్రభుత్వ మానవీయ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు గౌరవంగా జీవించేందుకు అందించే భరోసా అని అన్నారు.ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం ప్రజా ప్రతినిధులుగా రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలు అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఏదైనా అంశంపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని, పూర్తి అవగాహనతో మాట్లాడాలని హితవు పలికారు. ఈ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రతిరోజూ దాదాపు 18గంటల పాటు ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి,







ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదం అభిమానంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, పేద ప్రజల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీబలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలనిలి ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్ బంగారి నరసింహా రెడ్డి, వైస్ చైర్మన్ విద్యాసాగర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర రెడ్డి మాజీ జెడ్పీటీసీ కృష్ణ ప్రసాద్ యాదవ్ జంగా బీచుపల్లి యాదవ్, వివిధ తేజ రెడ్డి, గ్రామాల సర్పంచులు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నూతన పింఛన్ల లబ్దిదారులు, మండల ప్రజలు తదితరులు.

చేయూత లబ్ధిదారులకు నేడు మంజూరు ఉత్తర్వుల పంపిణీ

- ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా ఉత్తర్వుల అందజేత

ఆలంపూర్ నవంబర్ 17(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ నియోజకవర్గ పరిధిలోని చేయూత పథకం లబ్ధిదారులకు నేడు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో (నవంబర్ 18) మంజూరు ఉత్తర్వులు పంపిణీ చేయనున్నారు.ఈ సందర్భంగా ఆలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, మధ్యాహ్నం ఒంటిగంటకు స్వయంగా లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను అందజేయన ున్నారు. అలాగే అయిజ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చేయూత లబ్ధిదారులకు అయిజ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు రైతు వేదికలో, అయిజ మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు మున్సిపాలిటీ కార్యాలయంలో ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి అయిజ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు తెలిపారు



ఆరు కోట్ల నిధులతో లంకల టు నంద్యాల బీటీ రోడ్డు పనులు ప్రారంభం

మాటల్లో కాదు... చేతల్లో అభివృద్ధిని చూపిస్తాం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్

నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకల గ్రామము నుండి సీసీ కుంట మండలం నంద్యాల వరకు ఆరు కిలోమీటర్ల గాను 6. కోట్ల రూపాయలతో లంకాల బీటీ రోడ్డు.. పనులను మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, సంబంధాన్నికారులకు పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధికి మరో నిదర్శనం! అన్నారుతెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి.అన్న ఆదేశాల మేరకు....నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ గారి ఆధ్వర్యంలో. మక్తల్ నియోజకవర్గం: నర్వ మండలంలోని లంకాల నుండి ఉంద్యాల గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణా పనులను ప్రారంభించడం జరిగింది..ప్రజల అవసరాలను గుర్తించి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.లంకాల నుండి ఉంద్యాల బీటీ రోడ్డు పనుల ప్రారంభం



అందుకు మరో ఉదాహరణఅభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంప్రజల సమస్యలకు పరిష్కారం



చూపిస్తున్నమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నగారికి లంకాల గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు.ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

పంజుగుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ..

- విద్యార్థులహాజరు పెంచాలని ఆదేశం

- విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతలో నిర్లక్ష్యం వద్దు..

- మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి:

- జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

కల్వకుర్తి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):

కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మొత్తం 43 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సంప్రదింపులు జరపాలని సూచించారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు తీసుకుంటామని



తెలిపారు.అనంతరం తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, మెనూ అమలు, వంటశాల పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ



పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల పెంపునకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.కలెక్టర్ వెంట కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మండల విద్యాధికారి శంకర్ నాయక్, గ్రామ సర్పంచి పర్వతాలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రాజెక్టులకు భూసేకరణ అడ్డంకులు తొలగించండి !

- పెండింగ్ అవార్డులు, పరిహారం, భూముల మ్యుటేషన్ వెంటనే పూర్తి చేయాలి

- బ్రహ్మోస్, అమర్ రాజా నుంచి ఉదండాపూర్ రిజర్వాయర్ వరకు..

ప్రాజెక్టుల వారీగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో చేపడుతున్న కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, నిర్మాణ పనుల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన చోట పెండింగ్ అవార్డులను జారీ చేయడంతోపాటు, అర్హులైన భూయజమానులకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసి, భూముల మ్యుటేషన్ ప్రక్రియను సత్వరమే చేపట్టాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు, పరిష్కరించాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు.

బ్రహ్మోస్, అమర్ రాజా పరిశ్రమల భూసేకరణపై ప్రత్యేక దృష్టి

బ్రహ్మోస్ క్షిపణి పరిశ్రమ ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డులను వెంటనే జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూములను స్వాధీనం చేసుకుని సంబంధిత సంస్థకు అప్పగించడంతోపాటు, అప్పగించిన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమర్ రాజా పరిశ్రమకు సంబంధించిన భూసేకరణ సమస్యలను కూడా ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

జాతీయ రహదారి, రైల్వే పనులకు ఆటంకాలు వద్దు



భారతమాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు సంబంధించి భూసేకరణలో పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూసేకరణ కారణంగా కీలక మౌలిక సదుపాయాల పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు గడువు నిర్దేశం

మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి మిగిలిన భూసేకరణ సమస్యలను సంబంధిత తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, అవార్డుల ప్రక్రియ పూర్తయినందున తదుపరి పనులపై దృష్టి సారించాలని తెలిపారు. అల్లిపూర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూముల సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలోని భూములను నీటిపారుదల శాఖ అధికారులకు స్వాధీనం చేసి అప్పగించాలని సంబంధిత తహసీల్దార్‌ను ఆదేశించారు. సేకరించిన భూములకు సంబంధించిన మ్యుటేషన్ ప్రక్రియను కూడా తక్షణమే పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

కురుమూర్తి రహదారులు, భూత్పూర్ ఎస్టీపీపై సమీక్ష

కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద నిర్మిస్తున్న రహదారులకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూత్పూర్ మండలంలో మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నిర్మాణానికి అవసరమైన భూమిని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో గుర్తించి సేకరించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

భూసేకరణ జాప్యంతో అభివృద్ధికి బ్రేక్ పడకూడదు

ప్రాజెక్టుల వారీగా భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని, భూసేకరణ సమస్యలు అభివృద్ధి ప్రాజెక్టుల జాప్యానికి కారణం కాకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ యాదగిరి, జిల్లా భూ సర్వే రికార్డుల అధికారి ఎ.డి. అశోక్, మున్సిపల్ కమిషనర్ రామానుజులు రెడ్డి, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీ జన్మదిన వేడుకల సందర్భంగా క్రికెట్ సందడి

- కల్వకుర్తిలో =ఖీూ-1 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం- ఉప్పల వెంకటేష్ సహకారంతో

ఆర్ఎస్పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ





కల్వకుర్తి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలో ఆర్ఎస్పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో =ఖీూ-1 క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యతను పెంపొం దించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బావండ్ల మధు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, మున్సిపల్ మాజీ స్పెషల్ నాలెజ్డ్ పర్సన్ కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసులు, గంధం కిరణ్ ప్రసాద్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, గండికోట రాజు, పాండు గౌడ్, మేకల శ్రీనివాసులు, గంప శ్రీనివాసులు, పూరి రమేష్ పాల్గొన్నారు.అలాగే టోర్నమెంట్ నిర్వాహకులు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వట్టేపు కిషోర్, నరేష్, దుబ్బ నాగేష్, అనిల్, ఆర్ఎస్పి ఫౌండేషన్ సభ్యులు అశ్విన్, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ పెండింగ్ ఫైళ్లకు చెక్ పెట్టండి.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు!

– తహసీల్దార్లకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా గట్టి ఆదేశాలు

– రోజుకు 40 ఎకరాల రీ సర్వే లక్ష్యం.. 60 రోజులు దాటితే బాధ్యులపై చర్యలు

– భూభారతి, సాదాబైనామా, భూదాన్ భూములు, కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక సమీక్ష

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

రెవెన్యూ శాఖలో పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో జాప్యానికి తావివ్వ కుండా తక్షణ చర్యలు చేపట్టాలని, భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజలు తమ భూ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మీ సేవ, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, కోర్టు కేసులు, భూదాన్ భూముల ఆన్‌లైన్ నమోదు, రైల్వే లైన్ డబ్లింగ్, భారతమాల జాతీయ రహదారుల భూసేకరణ మ్యుటేషన్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, సాదాబైనామా కేసులు, జీవో 59 కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ, రీ సర్వే పురోగతిపై మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

60 రోజులు దాటితే కఠిన చర్యలు!

మీ సేవ ద్వారా అందిన రెవెన్యూ దరఖాస్తులను 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉంచకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉంచితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి పోర్టల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డేటా సవరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ వంటి సేవల్లో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

కోర్టు కేసులు, భూదాన్ భూములపై ప్రత్యేక దృష్టి

దేవరకద్ర, నవాబ్‌పేట, బాలానగర్, మహమ్మదాబాద్, అడ్డాకల్ తదితర మండలాల్లో కౌంటర్లు దాఖలు చేయాల్సిన కేసులు, కోర్టు ధిక్కరణ కేసులు, ఇతర పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. భూదాన్ భూములను గ్రామాల వారీగా గుర్తించి, వివరాలను ధ్రువీకరించిన అనంతరం రెండు మూడు రోజుల్లో భూభారతి పోర్టల్‌లో నమోదు చేయాలని తహసీల్దార్లకు సూచించారు.



రెవెన్యూ సదస్సుల దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

మహబూబ్‌నగర్ అర్బన్, చిన్నచింతకుంట, గండీడ్, భూత్పూర్, మూసాపేట మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలున్న దరఖాస్తులను మినహాయించి మిగిలిన వాటన్నింటినీ వెంటనే పరిష్కరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.మూసాపేట, జడ్చర్ల, కోయిలకొండ, మహమ్మదాబాద్, కాకుంట్ల మండలాల్లో సాదాబైనామా దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జీవో 59 కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

రోజుకు 40 ఎకరాల రీ సర్వే తప్పనిసరి!



అనంతరం భూముల రీ సర్వే పురోగతిపై సమీక్షించిన కలెక్టర్ ప్రతి సర్వేయర్ రోజుకు కనీసం 40 ఎకరాల భూమిని సర్వే చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఆదేశించారు. జడ్చర్ల, హన్వాడ, చిన్నచింతకుంట తదితర మండలాల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పనిచేసిన సర్వేయర్లను వెంటనే ఇతర గ్రామాలకు కేటాయించి తదుపరి సర్వే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రోవర్ పరికరాల కొరత ఉంటే వెంటనే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిర్లక్ష్య సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహించే సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే నిబంధనల ప్రకారం వారి లైసెన్సుల రద్దుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూ సర్వే రికార్డుల అధికారి ఎ.డి. అశోక్, మండల తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ,

చిన్నంబావి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి చిన్న వయసులోనే మృత్యువు ఒడికి చేరిన ఉడుత లావణ్య (17) అకాల మరణం చిన్నంబావి మండలం దగడపల్లి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. నిండు నూరేళ్లు జీవించాల్సిన యువతి అనూహ్యంగా కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. లావణ్య మృతి వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు లావణ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణ, చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మధుసూదన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గజ్జె ఈదన్న యాదవ్ ఉన్నారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్ సువర్ణ కురుమయ్య, మల్లికార్జున్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య, డేగ శేఖర్ యాదవ్, రామ్ చందర్, ఆంజనేయులు తదితరులు లావణ్య పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తీరని విషాదం.. కన్నీటి వీడ్కోలు!చిన్న వయసులోనే లావణ్య మృతి చెందడం గ్రామస్థులను కలచివేసింది. తమ కళ్లముందే పెరిగిన యువతి ఇక లేదన్న వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంగారు భవిష్యత్తు ఉన్న లావణ్య అకాల మరణం తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చింది. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నాయకులు భరోసా ఇచ్చారు.







ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ యంత్రాంగం కొరడా!

- 20 గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

- కూలీల హాజరు సున్నా.. విధుల్లో అలసత్వంపై అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆగ్రహం

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. వివిజి రాంజీ కార్యక్రమంలో కూలీల సమీకరణ చేపట్టకుండా, రోజువారీ కూలీల హాజరు సున్నాగా నమోదు చేస్తున్న 20 గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం వెబెక్స్ సమావేశం ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో కార్యక్రమం అమలు, లేబర్ రిపోర్టుల నమోదు, నిర్దేశిత పారామీటర్ల పురోగతి, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ఆయన సమీక్ష నిర్వహించారు.

హాజరు సున్నాపై సీరియస్.. సంజాయిషీ ఇవ్వాల్సిందే!

కూలీలను ఉపాధి పనులకు సమీకరించకపోవడం, రోజువారీ హాజరు సున్నాగా నమోదవడాన్ని అదనపు కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. సంబంధిత సిబ్బంది నిర్దిష్ట గడువులోగా తమ నిర్లక్ష్యంపై వివరణ సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలను గుర్తించాలని, ఉపాధి పనులకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.నిర్దేశిత లక్ష్యాలను



సాధించడంలో అలసత్వం వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు గ్రామ పంచాయతీల వారీగా కార్యక్రమ అమలును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

పెండింగ్ లేబర్ రిపోర్టులు వెంటనే పూర్తి చేయాలి

ఇప్పటివరకు లేబర్ రిపోర్టుల నమోదు ప్రారంభించని గ్రామ పంచాయతీల అధికారులు వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. పెండింగ్ నివేదికలను జాప్యం లేకుండా పూర్తి చేసి గడువులోగా సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్దేశించిన ఏ ఒక్క పారామీటర్‌పైనా పనులు ప్రారంభించని గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపైనా సమీక్ష

అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తీరును సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దిష్ట గడువుల ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వెబెక్స్ సమావేశంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నర్సింహులు, సీపీఓ నర్సింహులు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మిషన్ భగీరథ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


నవాబ్‌పేటకు 861 కొత్త పింఛన్లు.. అర్హులందరికీ చేయూతే లక్ష్యం!

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిన

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జడ్చర్ల, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):

గత ఏడెనిమిదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రజా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మంగళవారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కొత్తగా మంజూరైన 861 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నవాబ్‌పేట పాఠశాలలో రూ.38 లక్షలతో ప్రహరీ నిర్మాణం పూర్తిచేశామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి ఐదు ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనపై అటవీ శాఖతో చర్చిస్తున్నామని, ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతం నుంచి ఆలయానికి పర్యాటక మార్గం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని



వెల్లడించారు.రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాల వారీగా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 25 తర్వాత సర్పంచులు, అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి అవసరాలపై సమీక్షించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి



మహిళలకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నరసింహులు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీత, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

"ఎండిన పంటల సాక్షిగా.. 'నువ్వే రావాలి సార్.. కేసీఆర్ సార్' అంటూ రైతు గళం!"

- ఎండుతున్న పంటలు.. కన్నీరు పెడుతున్న రైతులు..

దోనూర్ సింగర్ ఆంజనేయులు పాటతో రైతుల గోడు వినిపించిన బీఆర్ఎస్ నేతలు

- పాటను విడుదల చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్..

ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

మహబూబ్‌నగర్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని, గతంలో కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా ఉండేదని పేర్కొంటూ మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామానికి చెందిన గాయకుడు సింగర్ ఆంజనేయులు ఆలపించిన పాట రాజకీయంగా చర్చనీయాంశమైంది. "నువ్వే రావాలి సార్.. కేసీఆర్ సార్" అంటూ రైతుల కష్టాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ పాటను మాజీ మంత్రి డాక్టర్ విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు నష్టపరిహారం అందించడం లేదని విమర్శించారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



చేశారు.

రైతులకు భరోసా ఏదీ?

ఉన్న పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, యాసంగి పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని అన్నారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

పశువులకు గ్రాసం లేదు.. ప్రజలకు తాగునీటి కష్టాలు!

గ్రామీణ ప్రాంతాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని, పశువులకు తాగునీరు కూడా అందని పరిస్థితులు నెలకొంటున్నాయని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పశుగ్రాసం, తాగునీటి కొరత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతుల కష్టాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను పాట రూపంలో ప్రజల ముందుకు తీసుకువచ్చిన సింగర్ ఆంజనేయులును ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్. శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట!

- ఎమ్మెల్యే యెన్నం నేతృత్వంలో నియోజకవర్గ రూపురేఖల్లో మార్పు

- తాగునీటికి రూ.220 కోట్లు.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి

రూ.603 కోట్లు: ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

మహబూబ్‌నగర్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో):

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో సుమారు 3,700 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళలకు రూ.5 లక్షల బీమా పథకాన్ని వర్తింపజేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి నిధులు..



ఎడ్యుకేషన్ హబ్‌గా పాలమూరు: సిరాజ్ ఖాద్రీ

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతోందని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా కోసం రూ.220 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.603 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు ఆజ్మత్ అలీ, రాములు యాదవ్, నాగరాజు, మల్లేష్, మురళీ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.